

# బండి కదిలింది

**గఫార్**

ఇంట్లో నుంచి బయటపడి నడక ప్రారంభించాం.

రోడ్డెంట వాహనాల రొద తప్ప, మా ఇద్దరి మధ్య మాటల్లేవు.

అలా ఇద్దరమూ మౌనంగానే నడుచుకుంటూ రైల్వేస్టేషన్ చేరేసరికి పదిన్నరయింది. వ్యవసాయ పనుల రోజులు కారణంగా కావచ్చు, స్టేషన్లో ప్రయాణీకులు అక్కడక్కడ పల్చగా ఉన్నారు. సుభాస్ చేతికి బ్రీఫ్‌కేస్ ఇచ్చి, నేను బుకింగ్ కౌంటర్ దగ్గరకెళ్ళాను టికెట్ కోసం.

సికిందరాబాద్ టూ గుంటూర్ ఇంటర్ సిటీ ఒక గంట లేట్ అని చెప్పాడు బుకింగ్‌క్లర్క్.

అలవాటైన జవాబే గనక, నేను కేజువల్‌గా తీసుకొని కదలబోయాను. అంతలో నాతోపాటు టికెట్ కోసమని వచ్చిన మరో ప్రయాణీకుడు బుకింగ్‌క్లర్క్ నాతో చెప్పిన జవాబు విని - "ఛీ... ఛీ... ఈ దేశం ఇక బాగుపడి చావదండి!" అంటూ నా వైపు చూశాడు. నేను అతని కామెంట్‌కు కమిట్ అయి - సంభాషణను కొనసాగించాలని అతని ఉద్దేశమై ఉంటుంది. కాని నేను అతనన్న మాటల్ని గమనించనట్లుగా ఉండిపోయాను. అతను నన్నో జడపదార్థాన్ని చూసినట్లుగా చూసి, బుకింగ్‌క్లర్క్ వైపు తిరిగి, ట్రైన్ లేటవడానికి రీజనింగ్స్ అడుగుతూ రైల్వే డిపార్ట్‌మెంట్ అసమర్థత మీద మండిపడుతున్నాడు.

పాపం! అతని వృధా కంఠశోష పట్ల జాలిపడి, సుభాస్ కూర్చున్న సిమెంట్ బెంచ్ వైపునకు నడిచాను.

సుభాస్ నన్ను చూసి "టికెట్ తీసుకున్నావా?" అడిగాడు. ఇంటి వద్ద నుండి బయలుదేరిన తర్వాత మా ఇద్దరి మధ్య ఇదే మొదటి సంభాషణ.

"లేదు. ట్రైన్ గంట లేటుందట. నే వెళ్తాలే. నువ్వింటికి వెళ్ళు" అన్చెప్పి బెంచిపైన కూలబడ్డాను.

"ఆఫీసులో పని కూడా ఏమీ లేదు. నిన్ను సెండ్‌హాఫ్ చేసి వెళ్తాలే" అని సర్దుక్కూర్చున్నాడు తను.

రైలుపట్టాల దిక్కుగా చూస్తూ నేను. నన్నే తదేకంగా గమనిస్తూ తనూ వుండిపోయాం. ఇద్దరి మధ్య అలా కొన్నిక్షణాలు గడిచాక-

"ఇలా ఎన్నాళ్ళు గడపదల్చుకున్నావ్?" అడిగాడు సుభాస్.

అది నేనూహించిన ప్రశ్నే కాబట్టి, నవ్వొచ్చి నవ్వేశాను.

"ఎందుకు నవ్వుతున్నావ్? అడగకూడని ప్రశ్న అడిగానా?" అన్నాడు.

"అబ్బే! అదేం కాదు. చీమ కుట్టింది" అన్నాను నవ్వుతూనే.

ఆ జవాబుకు కొంచెం కోపం తెచ్చుకొని - "అసలు... నువ్వు జీవితాన్ని సీరియస్‌గా ఎందుకు తీసుకోవు? ప్రతిదాన్ని తేలిగ్గా తీసుకుంటావెందుకు? అందుకే నీ బతుకిట్లా అఘోరించింది. తెల్సా?" అన్నాడు.

ఆ మాటలతో నేను సీరియస్ కాక తప్పలేదు. సుభాస్ అట్లా అనటానికి కారణం లేకపోలేదు. ఏడాదిన్నర క్రితం నేను నా భార్య విడిపోయాం. లోకం ఎవరికి తోచినట్లుగా వాళ్ళనుకున్నారు. బంధువులు, స్నేహితులు అందరూనూ. కాని వీళ్ళకు తెలీని నిజం ఏమిటంటే - నేను నా భార్య మేమిద్దరమూ పరస్పరం ఒక అవగాహనకు వచ్చే విడిపోయాం. ఆ విషయాన్ని బాగా ఊదాల్సిన పని లేదనిపించింది మాకు. ఆమె తాను కోరుకున్న వ్యక్తితో ఆనందంగా ఉండగలనని నమ్మి వెళ్ళిపోయింది. నేను ఒంటరినవుతాననో లేదాలోకం ఏమనుకుంటుందనో - నేనామెను శాసించి నా దానిగా ఉంచుకోదల్చుకోలేదు. అది నా దృష్టిలో పశుత్వంగా భావిస్తాను. అందుకే ఆమె కోరిక మేరకు ఆమెను పంపించి వేశాను. ఇప్పుడు నేను అందరి దృష్టిలో ఒంటరిని - ఇంకా మరికొందరి పరిభాషలో ... ఏదోని. సుభాస్ కూడా ఈ చట్రంలోని మనిషే కాకపోతే నా స్నేహితుడు గనక నన్ను బాగుపర్చుదామనే తాపత్రయంలో వుండి ఉంటాడు" అనుకొని మౌనంగా ఉండిపోయాను.

అదే అదనుగా తీసుకొని "నేను నీ శ్రేయోభిలాషిగా చెప్తున్నా. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదు. ఇప్పుడైనా స్థిమితంగా ఆలోచించి ఓ నిర్ణయం తీసుకో..." అన్నాడు.

"ఎలాంటి నిర్ణయం?" మామూలుగా ప్రశ్నించాను.

"అంటే... ఇలాగే ఉండిపోతావా?" అన్నాడు.

"ఏం? ఉండకూడదా?" ఎదురుప్రశ్న వేశాను.

తాను అసహనంగా తలవూపి "అసలు నువ్వేం కోరుకుంటున్నావ్? నీకేం కావాలి?" సీరియస్‌గా అడిగాడు.

ఏం చెప్పాలి? ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు. నాకేం కావాలో చెప్తే ఇవ్వగలడా? సుభాస్ నన్ను చూసి కేవలం జాలిపడ్తున్నాడు. ఏదో సలహా ఇచ్చి సహాయం చేయాలని తపిస్తున్నాడు. నేను సుభాస్ ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం వరకు కలిసి చదువుకున్నాం. వాళ్ళ నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అవటంతో - ఇద్దరం విడిపోయాం. అప్పట్లో ఇద్దరం మంచి మిత్రులం. సుభాస్ విడిపోయాక మా మధ్య ఉత్తరాలు కూడా లేవు. కాపోతే ఆ కలిసివున్న మూడు సంవత్సరాల ఆత్మీయత గుండెల్లో పదిలంగా ఉండిపోయింది. ఆ తర్వాత తామిద్దరం కలుసుకోవటానికి ఆరు సంవత్సరాలు పట్టింది. సుభాస్ ఉద్యోగం చేస్తూ నల్లగొండలోనే వున్నాడనే విషయం ఓ పాత మిత్రుడి ద్వారా తెల్సి హైదరాబాద్ వెళ్తూ ఇక్కడ దిగాను. ఈ కలిసి వున్న నాలుగు రోజుల్లో- నా కథనంతా చెప్పాను. అది అతను నా పట్ల చూపుతున్న సానుభూతి. కాని నాకు ఎదుటివాళ్ళు చూపించే సానుభూతి రుచించదు. ఆ విషయం సుభాస్‌తో ఎట్లా చెప్పను. అదే ఆలోచిస్తూ ఉండిపోయాను.

"ఏమాలోచిస్తున్నావ్ చెప్పు? అసలు నీకేం కావాలి?" అదే ప్రశ్న రెండోసారి వేశాడు.

నాకు కొంచెం అసహనంగా ఉంది. అయినా జవాబు చెప్పక తప్పదు. "చెప్పనా" అన్నాను.

"చెప్పమనేగా అడిగేది. చెప్పు" అంటూ జవాబుకు ఎదురుచూస్తూ రిలాక్సయ్యాడు.

"అయితే విను" అంటూ మొదలుపెట్టాను. "నాకు శివాజీ వాడిన కత్తి కావాలి. ఔరంగజేబ్ గుర్రం కావాలి. అలెగ్జాండర్ కిరీటం కావాలి. ముంతాజ్ ప్రేమ కావాలి. అర్జునుడి గాండీవం కావాలి. శకుని పాచికలు కావాలి. కౌటిల్యుడి మేధస్సు కావాలి. వసుదేవుడి భవిష్యద్దర్శన విద్య కావాలి. ఏకలవ్యుడి బొటనవేలు కావాలి. కర్ణుడి కవచకుండలాలు కావాలి. బుద్ధుణ్ణి బ్రేక్ డాన్స్ డ్రస్‌లో చూడాలి. గాంధీ, గాడ్సే, నేను ముగ్గురం మూడు గ్లాసుల్లోమందు పోసుకుని ఛీర్స్ కొట్టాలి. శాంతి కావాలి. యుద్ధం కావాలి. ఇంకా... ఇంకా" అంటూ తడుముకునేంతలో -

"ఇక ఆపు!" అంటూ గావుకేక వేసినంత పనిచేశాడు.

"మరి ఎందుకు అడిగావ్?" అన్నాన్నేను.

"బుద్ధి గడ్డి తిని" అన్నాడు చెంపలేసుకుంటూ.

"ఈ ప్రపంచంలో ఎక్కువ శాతం మనుషులు చేస్తున్న పనే అది. అసలు తమకేం కావాలో తమల్ని తాము గుర్తించుకోలేరు. గుర్తించినా - తమ సమస్యల్ని ఎవరూ కనిపెట్టలేరనే ధీమాతో తమల్ని తాము వంచించుకుంటూ ఎదుటివాడిలో ఏ చిన్న సమస్య కనిపించినా అక్కడికీ తామేదో గొప్ప మేధావులైనట్లు - వాడిని పూర్తిగా ఆక్రమించుకొని ఉచిత సలహాలతో చెవులు పిండి చేతిలో పెడ్తారు. ఇది ప్రతి మనిషిలోని సహజమైన ఆత్మవంచనా గుణం. నీ అతిథిగా వచ్చి నీ సానుభూతిని తిరస్కరిస్తున్నందుకు మరోలా భావించకు మిత్రమా! ఈ సృష్టిలో ప్రతి ప్రాణికి తన గమ్యం తనకుంటుంది. ఒక్క మనుషుల్లో తప్ప. దానికి ఎవ్వరూ అతీతులు కారు. ఒక్క నా సమస్యే కాదు - ఒక్కటి అడుగుతాను చెప్పు. నువ్వు మాలతిని ప్రేమించావు. అవునా?" అడిగాను.

"ఆ విషయం ఇప్పుడెందుకు?" అన్నాడు కొంచెం అయిష్టంగా ముఖం పెట్టి.

"ఉత్తిగనే! ట్రైన్‌కు ఎట్లాగు టైం ఉంది గనక సరదాగా మాట్లాడుకుందాం. సమస్య నాకే కాదు. నీకూ ఉందని చెప్పటమే నా ఉద్దేశం. నువ్వు మాలతిని ప్రేమించావు కదా?"

"అవును"

"ఇప్పటికీ ప్రేమిస్తున్నావు. అవునా?"

"ఇప్పటికీ కాదు - ఎప్పటికీ ప్రేమిస్తాను" అన్నాడు ఆ జవాబులో తమని ఎవరూ విడదీయలేరు అనే నమ్మకం స్ఫురిస్తుంది.

"ఆ విషయంలో నువ్వూ, మీ ఆవిడ ఘర్షణ కూడా పడ్డారు కదూ?" మళ్ళీ ప్రశ్నించాను.

"అది... అది... పడ్డాం. అయితే?" తిరిగి ప్రశ్నించాడు. తను చెప్పని విషయాలు నాకెట్లా తెలిసాయా అని ఆలోచిస్తూ-

"అయితే... అంటే... నువ్వు ఇద్దరు స్త్రీలను ఒకేరకంగా కాంక్షిస్తున్నా వన్నమాట"

"కాదు. నేను మాలతిని మనసారా ప్రేమించాను. ప్రేమిస్తున్నాను. కాకుంటే పెద్దలు నిర్ణయించి చేసిన పెళ్ళి కనుక వినీతతో అలా సర్దుకు పోతున్నాను. నేను, మాలతీ ఏవో కొన్ని కారణాలవల్ల విడిపోయాం. కాని ఇప్పుడు విడిపోదల్చుకోలేదు. మేమే కాదు. మాలాగ ఈ సమాజంలో చాలామంది మనుషులున్నారు" సుభాస్ సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

"అంటే... స్త్రీలు... నీదృష్టిలో..."

"ఏమో... నీ అంత పెద్దగా నేను దేనినీ విశ్లేషించలేను" అన్నాడు వెంటనే.

"అయితే నే చెప్తాను విను. స్త్రీ అంటే ప్రవహించే సముద్రం. సముద్రగర్భంలో మణులు, మాణిక్యాలతోపాటు కెరటాలు, బడబానలాలు, తుపాన్లు నిక్షిప్తమై ఉంటాయి. స్త్రీలోను అంతే. స్త్రీ తన జీవితంలో మరో స్త్రీ రావటాన్ని భరించలేదు. భరించినా మగాడు రెండు సముద్రాలను తనలో ఇముడ్చుకోలేడు. అది అత్యాశే అవుతుంది"

"ఇంతకూ... నువ్వు చెప్పదల్చుకున్నదేమిటి?" నా మాటలను మధ్యలో తుంచేసి అడిగాడు.

"ఏమీ లేదు. నీ సమస్యను నువ్వు కప్పి పెట్టుకుంటూ - నా మీద సానుభూతి చూపిస్తూంటే ఆశ్చర్యమనిపిస్తుంది. ముందుగా నీ సమస్యను గురించి ఆలోచించు - నీకు మాలతికి మధ్యనున్న సాన్నిహిత్యాన్ని నీ భార్య వినీత సహించగలదా?" అడిగాను.

"ఏం సహకరించుకుంటే వచ్చిన నష్టమేం లేదు. అర్థం చేసుకుని మసలుకుంటే సరి! లేకుంటే ఏం చేస్తుంది - విడాకులు తీసుకుంటుంది. చచ్చినట్లు పడి ఉంటే సరి. లేకుంటే అంతే జరుగుతుంది" ఆ స్వరంలో పురుషాధిక్యపు కరకు కాఠిన్యం కన్పించింది.

ఆ క్షణంలోనే... స్టేషన్‌లో గంట మ్రోగింది. దాంతో ఇద్దరి మధ్య సంభాషణ ఆగిపోయింది.

నేను వెళ్ళి టికెట్లు పట్టుకొచ్చాను.

నా చేతిలోని రెండు టికెట్లను ఆశ్చర్యంగా చూసి, పొరపాటున తెచ్చానేమోనని -

"అదేమిటి? రెండు టికెట్లు తెచ్చావెందుకు?" అని అడిగాడు సుభాస్.

"ఆ రెండో టికెట్ నాకోసం" అన్న గొంతు విని, వెనక్కు తిరిగాడు సుభాస్. ఎదురుగా వినీత సూట్‌కేస్‌తో నుంచొని ఉంది.

"వినీ... నువ్వు..." ఆశ్చర్యంతో మాటలు పెగలటం లేదు సుభాస్‌కు.

"అవును. నేనే. నేను ఆనంద్‌తో వెళ్తున్నాను. అంటే... ఆనంద్ భాగస్వామిగా వెళ్తున్నాను"

"వినీ... ఏం మాట్లాడుతున్నావ్?" అరిచాడు సుభాస్. షాక్ తిన్నవాడిలా కంపించిపోతూ.

"ఎస్! ప్లీజ్ కూల్ డౌన్. డోంట్ బి సిల్లీ. ప్లీజ్ ఒక్క క్షణం రిలాక్సయి నే చెప్పేది వినండి" అంది వినీత.

చెవులప్పగించి స్థాణువై నుంచున్నాడు సుభాస్.

"సుభాస్! వివరంగా చెప్పటానికి ఇప్పుడు సమయం చాలదు. క్లుప్తంగా చెప్తాను. దయచేసి వినండి. కాలేజీలో చదువుకునే రోజుల్లోనే ఆనంద్ నాకు పరిచయమయ్యాడు. ఆపాటికే మీరు కాలేజ్ నుండి టి.సి. తీసుకొని వెళ్ళిపోయారు. అప్పుడే నేను కొత్తగా జాయిన్ అయ్యాను. నేను ఆనంద్ ఆ రోజుల్లో చాలా సన్నిహితంగా ఉండేవాళ్ళం. నిజం చెప్పాలంటే ప్రేమించుకున్నాం కూడా. ఈ సమాజంలో అందరి ప్రేమకథల్లాగే మా ప్రేమ కూడా విడిపోయింది. తర్వాత ఏముంది - మీతో పెళ్ళి జరిగిపోయింది. అయితే ఈ రెండు సంవత్సరాల మన దాంపత్యంలో - మీరు నాతో మనసారా కలసి వుండలేరనే విషయం తెలుసుకున్నాను. అందుకు పరిష్కారం వెతుక్కుంటున్న దశలో ఆనంద్ మనింటికి వచ్చాడు. ఆనంద్ మనింటికి వచ్చేవరకు మీరు, ఆనంద్ మిత్రులన్న విషయం నాకు తెలీదు. మేం విడిపోయాక తిరిగి ఇద్దరం కల్సుకోవటం కూడా ఇదే మొదటిసారి. ఇంతకూ నేను చెప్పదల్చుకున్నదేమిటంటే - ఆనంద్ ఏదైతే ఆశించి - తన భార్య కోరుకున్న ప్రియుడికి అప్పగించి తాను ఒంటరి అయ్యాడో - నేను కూడా మీరు ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించే మీ మాలతి కోసం నేను దూరం కాదల్చుకున్నాను. ఆ ఆలోచనా క్రమంలో ఆనంద్ రావటం పరిష్కారంగా భావించాను. ఇప్పటి నుండి ఆనంద్ నేను కల్సి వుండదల్చుకున్నాం. మీరు మాలతి కలిసి సుఖంగా ఉండండి. బైదిబై... ఆనంద్ నాకంటే ముందు మీకు మిత్రుడు. అదే సంబంధంతో మీరు, మాలతి కల్సి మా ఇంటికి వస్తూ పోతూ ఉండండి. అందుకు ఆనంద్‌కు కూడా అభ్యంతరం ఉండదు" అని నేను సరిగ్గానే మాట్లాడానా లేదా అన్నట్లు వినీత నా వైపు చూసింది.

నేను 'రైట్' అన్నట్లు తల ఊపాను.

సుభాస్ ఇంకా షాక్ నుండి కోలుకున్నట్లు లేదు. నేనే భుజం తట్టి - "సుభాస్! టేకిట్ ఈజీ. ఇది చాలా సాధారణ చర్య. జీవితాలకు అవసరమైన సవరణ. ఇందులో కొట్టివేతలకు తావులేదు. ఇలాంటి సంస్కరణలు ఈ సమాజానికి చాలా అవసరముంది. అంతరంగాల్లో ఎవరినో ప్రతిష్టించుకొని - చీకటి గదుల్లో, చెమట కంపులు భరిస్తూ - శరీరాలతో కాటేసుకునేది దాంపత్యం కాదని ఈ పెళ్ళి వ్యవస్థకు చెప్పాల్సి ఉంది. ఈ విషయంలో నువ్వు మాతోపాటు ఏకీభవించి సహకరిస్తావనే ఆశిస్తున్నాను" అన్నాన్నేను.

అంతలో ట్రైన్ వచ్చి ఆగింది.

దిగే ప్రయాణీకులు ఎక్కే ప్రయాణీకులతో స్టేషన్‌కు ఊపిరి వచ్చినట్లుగా సందడితో నిండిపోయింది.

సుభాస్ ఇంకా కోలుకోలేదు. నేనే చేయి పట్టుకొని ఊపి "హైదరాబాద్ వెళ్ళాక అడ్రస్‌తో లెటర్ వేస్తాను. మాలతిని తీసుకొని తప్పక రావాలి" అని చెప్పి వినీత - నేను చేతులు పట్టుకొని ట్రైనెక్కాం.

గార్డ్ పచ్చజెండా వూపాడు.

ట్రైన్ కూతవేసి ముందుకు కదిలింది.

సుభాస్ మావైపే చూస్తున్నట్లున్నాడు. నేను- వినీత కిటికీలోంచి చేతులు ఊపాం బైబై అన్నట్లు.

సుభాస్ మరబొమ్మలా నుంచొని చెయ్యి ఎత్తి మాకు రెస్పాన్స్ ఇవ్వటానికి ప్రయత్నం చేస్తున్నాడు. ★